క్లుప్తంగా

శ్రీవారి సేవలో మాజీ మంత్రి


శ్రీవారి ఆలయం వెలుపల కొడాలి నాని

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం మాజీ మంత్రి కొడాలి నాని సేవించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

కళాశాలకు నీటి సౌకర్యం



పాకాల : స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నీటి సౌకర్యం కల్పించినట్లు ప్రిన్సిపల్ ఉమా మహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో నీటి కోసం విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని, పంచాయతీ ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాల్సి వచ్చేదన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పైప్‌లైన్ ఏర్పాటు చేయించారని వెల్లడించారు. ఇప్పుడు కళాశాలకు కావలసిన నీరు సమృద్ధిగా అందుతోందన్నారు. ఇందుకు సహకరించిన జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జి నాగరాజనాయుడు, ప్రవీణ్, ఇరంగారిపల్లె సర్పంచ్ వసంత, షబ్బీర్, అధ్యాపకుడు నాగరాజనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి మృతి

తిరుమల : తిరుమల బాలాజీ బస్టాండ్ బస్టాండ్ సమీపంలో వెంకటమ్మ(80) అనే మహిళ అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు మంగళవారం టీటీడీ అశ్విని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు దీనిపై కేసును నమోదు చేసిన పోలీసులు మృతురాలి వివరాల కోసం ప్రయత్నించగా దొరకలేదు. సమాచారం తెలిసిన వారు తిరుమల టూటౌన్ స్టేషన్ నంబర్ 0877–2289031కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి


కలామ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు


తిరుపతి గాంధీ రోడ్ : స్థానిక కొత్తపల్లె కళాక్షేత్రంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి కలామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అంటూ విద్యార్థులను ఉత్తేజపరచిన మహనీయులు కలామ్ అని వెల్లడించారు. ఆయన స్ఫూర్తితో ఎందరో శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశ అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, మల్లారపు రవి ప్రసాద్, కొత్తపల్లి మునిరత్నం, కొండే చెంగారెడ్డి, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, రెడ్డెప్ప నాయుడు ,మురళి, శ్రీనాథ్ రెడ్డి , చెంగల్ రాయులు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గుండె జబ్బుల విభాగం అవసరం


ధర్నా నిర్వహిస్తున్న చింతామోహన్

తిరుపతి తుడా : తిరుపతి రుయా ఆస్పత్రిలో గుండె జబ్బుల విభాగం అవసరమని, వెంటనే పునరుద్ధరించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం రుయా ఆసుపత్రి ఆవరణలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ధర్నాకు దిగారు. చింతామోహన్ మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, టీటీడీ ఈఓ రుయా ఆస్పత్రికి వచ్చే సామాన్య నిరుపేద రోగుల గురించి ఏమాత్రం ఆలోచించడం లేదని ఆరోపించారు. గుండె జబ్బు వస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రుయా కార్డియాలజీ విభాగంలో ఒక్క డాక్టర్ ఉన్నారని, రోగుల అవసరాలను గుర్తించి వైద్యుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపీగౌడ్, రవి, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్,ముని శోభ, వెంకటేష్ పాల్గొన్నారు.

19 అడుగులకు చేరిన అరణియార్ నీటి మట్టం



నాగలాపురం: పిచ్చాటూరు అరణియార్ నీటి మట్టం మంగళవారం సాయంత్రానికి 19 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. వర్షానికి ముందు ఈ ప్రాజెక్టులో 18 అడుగుల వరకు నీరు ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు 160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ఆధ్యాత్మిక క్షేత్రంలో

మద్యం మాఫియా!

ఆధ్యాత్మిక క్షేత్రంలో మద్యం మాఫియాకు అడుగుపెట్టింది. పేదల రక్తం పీల్చేసేందుకు సిండికేట్‌గా ఏర్పడింది. ప్రజలను యథేచ్ఛగా దోచుకునేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. పవిత్ర తిరుపతిని మందుబాబుల అడ్డాగా మార్చేసి రూ.కోట్లు కూడబెట్టుకునేందుకు ప్రణాళికలు అమలు చేస్తోంది. సంపద సృష్టి పేరుతో కూటమి ప్రభుత్వం సైతం లిక్కర్ వ్యాపారులకు వంతపాడుతోంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరునగరిని మద్యం మత్తులో ముంచేందుకు సహకారం అందిస్తోంది. ఈ క్రమంలో సర్కారు వైఖరిపై మహిళాలోకం మండిపడుతోంది. జనం నెత్తిన భస్మాసుర హస్తం పెడుతోందని ఆందోళన చెందుతోంది. యువత భవితను నిర్వీర్యం చేసే దిశగా పరిపాలన అందిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కుటుంబాలను రోడ్డున పడేసేందుకే ప్రైవేట్ మద్యం దుకాణాలను తీసుకువచ్చిందని ఆవేదన వెలిబుచ్చుతోంది.

– తిరుపతి సిటీ

- సంపద సృష్టికి ప్రజల ప్రాణాలను ఫణంగా పెడతారా..?
- మహిళల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తారా..?
- ప్రైవేట్ వైన్‌షాపులతో మందుబాబులను ప్రోత్సహిస్తారా..?
- కూటమి ప్రభుత్వ వైఖరిపై భగ్గుమన్న నారీలోకం

ఆకతాయిలు పెరిగే ప్రమాదం



యువత పెద్దసంఖ్యలో మత్తుకు బానిసలుగా మారిపోతారేమో అని భయంగా ఉంది. తిరుపతిలో మద్యం మాఫియా ఆగడాలు అధికమవుతాయని ఆందోళనగా ఉంది. జనాలకు తాగుడు అలవాటు చేసి ఆదాయం పొందడం ప్రభుత్వానికి మంచిది కాదు.రోడ్లపై మత్తులో మునిగిన ఆకతాయిలు పెరిగే ప్రమాదముంది. దీంతో ఆడబిడ్డల భ ద్రత ప్రశ్నార్థకమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రైవేట్ వైన్‌షాపులతో ప్రజలకు ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తోంది.

– ఎల్‌ఎస్ లక్ష్మి, ఏఐఎమ్‌ఎస్, మహిళా సంఘం ఇన్‌చార్జి

మహిళల శాపం తగులుతుంది



చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు మహిళలపై ఎంత ప్రేమ, భక్తి ఉందో ఇప్పుడు అందరికీ అర్థమైంది. ప్రైవేటు వ్యక్తులకు వైన్‌షాపులు ఇచ్చి కల్తీ మద్యం అమ్మించి ప్రజల ప్రాణాలను తీసే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో బాబు సీఎంగా ఉన్నప్పుడు కల్తీ మద్యం సేవించి ఎంతో మంది పేదలు చనిపోయారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అ దే పరిస్థితులను మళ్లీ తీసుకువస్తున్నారు. రాష్ట్రంలో దారుణమైన పాలన నడుస్తోంది. మహిళల ఆగ్రహానికి గురైన వారు, వారి కడుపుకొట్టినవారు ఎక్కువకాలం పాలన కొనసాగించలేరు. కూటమి ప్రభుత్వానికి మహిళల శాపం తగులుతుంది.

– సుభాషిణిదేవి, విశ్రాంత ఉపాధ్యాయిని

పేదల కడుపు కొట్టేందుకే..



పేదల కడుపుకొట్టేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యం షాపులు పెంచుతున్నారు. ఈ పరిస్థితుల్లో మాలాంటి పేద కుటుంబాలు ఎలా బతకాలి. రోజంతా కష్టం చేసిన సొమ్ము ఇంట్లోని మగవాళ్లు బ్రాందీ షాపులకే తగలబెట్టేస్తారు. ప్రశాంతంగా ఉన్న కుటుంబాలలో ప్రభుత్వం చిచ్చుపెడుతోంది. ఇష్టారాజ్యంగా తాడేసి ఆడ వాళ్లని హింసించమని ప్రోత్సహిస్తోంది. ఇలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. చంద్రబాబును ఇక ఎప్పటికీ నమ్మరు. తిరుపతి వంటి పవిత్ర ప్రాంతంలో మద్యం మాఫియాకు స్థానం కల్పించడం దారుణం.

– శకుంతల, గృహిణి

తగిన బుద్ధి చెప్పాలి



కూటమి ప్రభుత్వ విధానమే బాగాలేదు. ప్రైవేట్ వైన్‌షాపులను తీసుకురావడం మంచిది కాదు. తిరుపతి లాంటి నగరాన్ని మద్యం మాఫియాకు అప్పగించడం బాధ్యతారహితం. తక్కువ రేటుకే మద్యం దొరకడంతో ఇకపై తాగుబోతుల వీరంగాలు పెరిగిపోతాయి. తప్పతాగి వాహనాలు నడిపేవాళ్లు అధికమవుతారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలి.

– డాక్టర్ సాయిలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి

ఉద్యమించాలి



మద్యం ఏరులా పారించి రూ.కోట్లు దండుకునేందుకు కూటమి సర్కార్ పన్నాగం పన్నింది. ఈ విషయం అందరికీ అర్థమైంది. అందులో భాగంగానే మద్యం షాపులను మాఫియాకు కట్టబెట్టింది. ఆధ్యాత్మిక నగరంలో దైవస్మరణ మాత్రమే ఉండాలి. అలాంటిది విచ్చలవిడిగా వైన్‌షాపులు ఏర్పాటు చేయడం దారుణం. తాగుబోతును ప్రోత్సహించడం తగదు. మహిళల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చేశారు. దీనిపై మహిళా సంఘాలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది.

– లక్ష్మమ్మ, గ్రామీక మహిళా జిల్లా కన్వీనర్

భయం భయంగా గడపాల్సిందే!



మద్యం దుకాణాలను విచ్చలవిడిగా ప్రభుత్వం మంజూరు చేయడం సరికాదు. ఆడవారిపై దురాగతాలు పెరిగితే ఎవరిది బాధ్యత. మద్యం కారణంగా కుటుంబాల్లో సైతం గొడవలు పెరిగి విచ్ఛిన్నమయ్యే ప్రమాదముంది. రోడ్లపై తాగుబోతుల వీరంగాలను భరించలేము. ఆడపిల్లలు భయం భయంగా గడపాల్సిన దుస్థితి దాపురిస్తుంది. ప్రజల ఆరోగ్యాన్ని సంపద సృష్టి పేరుతో చంద్రబాబు నిస్సిగ్గుగా మద్యం మాఫియా చేతిలో పెట్టేశారు.

– ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి

అన్నదానం.. మహాభాగ్యం


భక్తులకు అన్నదానం చేస్తున్న ప్రతాప్ స్వామిజీ

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు అన్నదానం చేయడం మహాభాగ్యమని ఏకవీర ఫౌండేషన్ ప్రతాప్ స్వామిజీ తెలిపారు. పెరటాసి మాసం సందర్భంగా ఏటా తమిళనాడు నుంచి భక్తులు కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుచానూరు మీదుగా తిరుమలకు వెళుతుంటారు. మంగళవారం ఈమేరకు సర్పంచ్ రామచంద్రారెడ్డితో కలసి ప్రతాప్ స్వామిజీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి కూడా వారికి భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 27 ఏళ్ల నుంచి నుంచి తమిళనాడుకు చెందిన శ్రీమారుతి రాయస్ భక్త మండలి వారు తిరుమలకు కాలినడకన వస్తున్నారన్నారు. శ్రీవారిని పరమభక్తితో కొలిచే భక్తులకు సేవలందించడం సంతృప్తిగా ఉందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, కొండే చెంగారెడ్డి, వాసు, బ్రహ్మానందం, జేజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

వరదయ్యపాళ్యం: మండలంలోని కువ్వాకులి పంచాయతీ లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం కుంభాభిషేకాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన్న తిలక్ బాబు, స్థానిక నేతలు మాధవయ్య, మహేంద్ర, సాయి రెడ్డి, శివయాదవ్, చంద్రయ్య, రమణయ్య, పాల్గొన్నారు.

కార్తీక్ లైవ్ షో ఉచిత ప్రవేశానికి వినతి


అధికారులతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టేడియం వేదికగా ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న సింగర్ కార్తీక్ లైవ్‌షోకు వర్సిటీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. మంగళవారం ఈ మేరకు వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్సిటీ గ్రౌండ్‌లో సింగర్ కార్తీక్ లైవ్ షో చూసేందుకు రూ.వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మీట్ అండ్ గ్రీట్ పేరుతో రూ.7,499, ఎమ్ఐపీ టికెట్ రూ.3,999, ఫైనల్ పేస్ పేరుతో రూ.1,999, వీఐపీ టికెట్ రూ.1299, జనరల్ ప్రవేశానికి రూ.699గా వసూలు చేయడం దారుణమన్నారు. వర్సిటీ గ్రౌండ్‌ను ఉపయోగించుకుని ఇక్కడి పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించకుంటే లైవ్‌షోను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీవీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ యుగంధర్, ఏపీవీహెచ్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రూకేష్, విద్యార్థి సంఘాల నాయకులు ముని, నరేష్, లిఖిత్, మురళి, దినేష్, మునీంద్ర, బాలాజీ, సాయి పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం


భారీ వర్షం నేపథ్యంలో నిర్మానుష్యంగా అలిపిరి


నగరంలో కురుస్తున్న వర్షం

తిరుపతి తుడా : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారడంతో తిరుపతిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టినా పలుచోట్ల ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. కాలువ ఉప్పొంగుతున్నాయని, ఇళ్లలోకి నీరు చేరుతోందని, రోడ్లు మునిగిపోయాయని పెద్దసంఖ్యలో కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

ప్రత్యేక నిఘా అవసరం

తుఫాను ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా కొరమేనుగుంట, గొల్లవానికుంట, జీవకోన, కొత్తపల్లె, కట్టకిందూరు. లక్ష్మీపురంతో పాటు కపిలతీర్థం, మాల్వాడీగుండం, పేరూరు నుంచి నగరంలోకి ప్రవేశించి నీటి పోటు అధికంగా ఉన్న ప్రాంతాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే లీలా మహల్ సర్కిల్ నుంచి కరకంబాడి వెళ్లే రోడ్డు పూర్తిగా జలమయమైంది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

తుపాను కారణంగా నగర ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామని కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. ఆమె మాట్లాడుతూ మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. మురుగునీటి కాలువలు పొంగిపొర్లకుండా ఎక్కడికక్కడ చెత్త తొలగిస్తున్నామని చెప్పారు. కాలనీలు, ఇళ్లలోకి నీరు చేరితే పంపింగ్ చేయడానికి మోటార్లతో సిబ్బంది సిద్ధంగా ఉన్నారని వివరించారు. మ్యాన్ హోల్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. తాగునీటి శుభ్రతకు చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్, సాంద్రత పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ ఉండకూడదని, తమకు సమాచారం అందిస్తే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. చెట్లు పడిపోయే స్థితిలో ఉన్నా తమకు తెలియజేయాలని కోరారు. దోమలు నివారణకు అన్ని వార్డుల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నామని, ప్రజలకు సాయం అందించేందుకు 30 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని వెల్లడించారు. ఎవరైనా ఇబ్బంది ఉంటే హెల్ప్ లైన్ 0877–2256766కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

17 పునరావాస కేంద్రాలు


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

నగరంలో వరద బాధితుల కోసం 17 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. పోస్టల్ కాలనీలోని పార్వతీపురం, నగర పాలక సంస్థ పాఠశాల, మంగళం తుడా క్వార్టర్స్ వద్ద గల ఎంపీపీ స్కూల్, కొత్తపల్లి, ప్రైమరీ స్కూల్, కొరమేనుగుంట రాజీవ్ గాంధీ స్కూల్. ఆర్‌ఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మధురానగర్ లోని ఎమ్‌ఎస్‌యూపీ స్కూల్, మధురానగర్‌లోని ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్, సంజయ్ గాంధీ కాలనీ లోని ఎంయూపీ స్కూల్, సత్యనారాయణ పురంలోని జెడ్పీ స్కూల్, కెనడీ నగర్ లోని డీ అడిక్షన్ సెంటర్, ఎరమిట్టలోని రత్నం, చైతన్య స్కూల్, సింగాలగుంట మున్సిపల్ స్కూల్, ఉప్పంగి హరిజనవాడ మున్సిపల్ స్కూల్, యశోదానగర్ లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్, ఎల్‌బీ నగర్‌లోని కేశవరెడ్డి స్కూల్, వేశాలమ్మ గుడి వీధిలోని ఇందిరా నగర్ స్కూల్‌లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాలకు ఇన్‌చార్జి అధికారులను సైతం నియమించినట్లు వెల్లడించారు.




భారీ వర్షానికి నిండిన మంగళంలోని చెన్నాయిగుంట చెరువులో చేపల వేట సాగిస్తున్న యువకులు

అభ్యసన వైకల్యంపై ర్యాలీ



చంద్రగిరిలో ర్యాలీ ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి

చంద్రగిరి : విద్యార్థుల అభ్యసన వైకల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిచేసుకోవచ్చని చంద్రగిరి ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్ఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. నిర్దిష్ట అభ్యసనా వైకల్యాలపై చంద్రగిరిలో మంగళవారం ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొంతమంది చదువులో వెనకబడి ఉంటారని, అటువంటి వారిలో 5 రకాల వైకల్యాలు ఉంటాయన్నారు. వాటికి తగిన విధంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చి చదువులో రాణించేలా తీర్చిదిద్దవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్య బోధన ఉపాధ్యాయులు ఉదయ్ కుమార్, శ్యామలాదేవి, వెంకట రాజేశ్వరి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..


రామచంద్రాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ మార్కొండయ్య నాయుడు కోరారు. నిర్దిష్ట అభ్యసనా జాగృతి వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆర్సీపురం ఎస్టీ కాలనీ వరకు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భాషణం, పఠనం, లేఖనం, గణితంలో వెనుకబడిన విద్యార్థులను ప్రాథమిక దశలోనే గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వాగ్దేవి, మిట్టూరు భవిత సెంటర్ టీచర్లు రాజేశ్వరీ, మనోహర్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి


నియామక పత్రం అందిస్తున్న మత్స్యకార సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : రాష్ట్రంలోని మత్స్యకారుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శ్రమిస్తున్నట్లు జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోస అప్పలరాజు స్పష్టం చేశారు. ఈమేరకు మంగళవారం కపిలతీర్థం సమీపంలోని సంఘం కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మత్స్యకారుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్స్యకారులు, బెస్త కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం తిరుపతి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఆదిమూలం గిరి, మహిళా అధ్యక్షులుగా ఎస్.లక్ష్మీదేవిని నియమించారు. కార్యక్రమంలో జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లా ఏకాక్షరి, అరవింద్, సలహాదారుడు రవి పాల్గొన్నారు.